పరీక్షలు

భమిడిపాటి కామేశ్వరరావు గారు

[ఇది ౨-౪-౧౯౩౧ తేదీని ఏలూరు హైస్కూలులో, పాతవిద్యార్థిసంఘంతరఫున జరిగిన వార్షికసమావేశసందర్భంలో చదివినది.]

ఇది ఈ హైస్కూలుతాలూకు పాతవిద్యార్థిసంఘం యొక్క ద్వితీయవార్షికోత్సవసమయం. ఈసందర్భంలో సరస్వతీపుత్రులైన సోదరులు చాలామంది ఎలుగుంటే ఒకర్ని ఒకరు కలుసుగోడానికీ, ఎఱక్కుంటే ఒకర్ని ఒకరు తెలుసుగోడానికీ, వీలైంది—లక్ష్మీపుత్రులైన సోదరులు భోజనం వగైరాఖంజాయింపులు చెయ్యడంవల్ల. ఈసభలో బాలురు వృద్ధులు, వృద్ధబాలురు, బాలవృద్ధులు, వగైరాలు, ఉన్నారు. వయోభ్యాసాల్ని బట్టీ, జ్ఞానైశ్వర్యాల్ని బట్టే మానవులకి అభిరుచులు ఉంటాయి. అనేకమైన అభిరుచులు గలవారు పంక్తులుతీర్చి కూర్చున్నప్పుడు యావన్మందికీ సయించే ఏకవస్తువు తేవడం కష్టం, అందేటట్టువడ్డించడం కష్టతరం. పోనీ ఏ ఎలకనో అడిగి తెచ్చి వడ్డించినతరవాత తీరా బాగుంటుందా మరి అని వారు భరించి భుజించినా అది అందరికీ రుచించడం కష్టతమం. అయినా సరే 'యథాశక్తి' సూత్రాన్ని అనుసరిస్తూండాలి. ఇక్కడ ఉన్నవారిలో, ప్రతివారూ ఎన్నోకొన్ని పరీక్షలు చవిచూసి ఉంటారు. అంచేత, మనకందరికీ, 'పరీక్షలు' అనేది సామాన్యవిషయం అనచ్చు. కాబట్టి, "పరీక్షలు" గురించి కొంచెం అంటాను.

హాస్యరహస్యం తెలిసిన ఒకకవి రాసినదాల్లో ఒకచోట:

వెంకన్న—రాముడూ! పరీక్షుంటేయేమిషిరా?

రాముడు—పరిక్ష అంటే యగ్జామినేషన్.

వెం—(పొడుం పీలుస్తూ) యెజ్ఞం నాకు తెలుసును. మేషం అంటే మేక; మేకపోతుని వేస్తారాయేమిషిరా?

రా—ఫూలిష్! యెజ్ఞం కాదు, మేషం కాదు. శాస్త్రాల్లో ప్రశ్నలు అడుగుతారు.

అని ఉంది. ఇంగ్లీషుమాటనిబట్టి వెంకన్న తీసిన అర్థంవల్ల కొంత నవ్వు వచ్చినా, కొంత సత్యంకూడా తేలుతుంది. అలాగ్గానే అసలుపదం అయిన పరీక్ష అంటే ఏమిటో చూడాలి. పరీక్ష అంటే చూడడమే, ఇటూ అటూ అంతటా నిదానించి చూడడం. సంభాషణల్లో "ఏం? ఆయన్ని మీరు అంత పరీక్షగా చూస్తున్నారు, ఎరుగుదురా?" అనీ, ఎక్కడేనా లోతభిసీళ్లవయినం తేల్చవలసొచ్చినప్పుడు, "ఎమో! అంత పరీక్షగా అడిగితే నేను చెప్పలేనుస్మీ దాం తగలెయ్యా!" అనీ అంటూంటారు. కొన్నికొన్నిమాటలకి అర్థాలు మారుతూంటాయి. క్రమేణా ఈమాటయొక్క అర్థంకూడా చెదిరింది. అక్కణ్ణించి, మనస్సులో ఉండే సంగతులు చూడ్డానికి చేసే ప్రయత్నం అనే అర్థంతో ఈమాట వాడుతోచ్చారు. మనస్సు కంటికి కనిపించదు. అల్లాంటి మనస్సులో ఏమన్నా అంశం గాని, వృత్తాంతం గాని ఉంటే (సాధారణంగా ఉండకపోవచ్చు లెండి!), అవి అంతకంటే కనపడకవు. అవి ఏరూపంగానో బహిర్గతం అయినప్పుడే వాటికి జన్మసిద్ధి. అందుకు సాధనం ప్రశ్న. అది గాలంలాగ పనిచేసి కల్మషంలేని మనస్సుని బట్టబయలు చేస్తుంది. తను చెప్పింది కట్టుదిట్టంగా కుర్రాడి మనస్సుని పట్టుకుని ఉందో లేదో కనిపెట్టడానికి, చెప్పేవాడు, చిన్నచిన్న ప్రశ్నలువేసి వాటిసమాధానాలు చూసుగుని మరీ చెబుతాడుకొత్తసంగతి. అనగా పరీక్షిస్తూండడం చెప్పేవాడికి నిత్యకర్మ. అందుకనే, చదువు చెప్పే బంధువుడు ఎవరేనా గుమ్మంలోకి వస్తే, ముసలమ్మగారు, "చూడు నాయ్నా! మా కుర్రకుంక పోతు

భారం చెప్పుగుంటున్నాడు. ఏక అల్లరి. కాస్త పరీక్ష చేసి వెడుదూ!" అని కోరుతుంది. ఆ ప్రకారంగానే, కొద్దిమంది విద్యార్థు లుండేటప్పుడు, ఏదేనా అంశం వాళ్ళకి వచ్చునో రాదో తేల్చడపువ్యాపారం ముఖాముఖీగా జరగచ్చు, జరుగుతూండేదికూడాను పూర్వం. అవి నోటిపరీక్షలు. ఒకొక్క విద్యార్థి ఏదో శాస్త్రం పాపం ఏ పదిపన్నెండేళ్లో చావగొట్టి చదివి పరీక్ష కొస్తే, పరీక్షకారుడు ఎక్కడిదో కొతివిలాంటి వంగి ప్రశ్న వాణ్ణడిగి, ఆకాస్తముక్కా వాడు చెప్పలేక పోతే, వాడికి అసలు ఆశాస్త్రంలో ఓనమాలు రావని తీర్పు చెప్పి పొమ్మనడం ఉండేది. అది న్యాయం అని ఎవరూ అనరు. కాని, వేనవేలు జనం గొడ్డలిపెట్టుగా వచ్చి, "మాకు ఫలానాశాస్త్రం వచ్చును, మా మనస్సులో ఉంది, కావలిస్తే మా మనస్సులు తణిఖీ చేయ్యండి" అని అడిగినప్పుడు, నోటిపరీక్ష అసంభవం అయింది. పైగా, విద్యార్థుల్లో అంతరాలు చూసి ఆరాలు తియ్యాలసి వచ్చినప్పుడు, అందరికీ ఒకేకాలంలో అవే ప్రశ్నలు ఇవ్వడం ధర్మం. అంచేత రాతపరీక్షలు బయల్దేరాయి. కొన్నికొన్ని రాతపరీక్షల్లో మూలగ్రంథాలు పక్కని పెట్టుగుని మాస్తూ సమాధానం రాయచ్చు—ఆ మూలగ్రంథాలుమాత్రం ఓ వాగన్‌వి ఉంటాయి. కాని సర్వసాధారణంగా రాతపరీక్షల్లో మూలగ్రంథాలు ఓమూల పడేసి ఖరాగా వెళ్లి సమాధానాలు రాయాలి. మెట్టుమాట. ఇప్పట్లో పరీక్ష అంటే, మనస్సుని కొలవడానికి ఏర్పాటు చేసి ఉన్న కొలామానంలాంటి ఒక పేపరులో ఉండే ప్రశ్నలకి సమాధానాలు రాయడం. పరీక్ష అనేమాటకిఇది మూలార్థంకాకపోయినా, ఇందులో కూడా పరీక్షకారుడు ప్రశ్నలు ఇవ్వడానికి వృత్తాంతం అంతటా చూడాలి, కుర్రాడిమనస్సు అంతటా చూడాలి. కుర్రాడు తనమనస్సు తను అంతటా మూసుగుని సమాధానం ఇవ్వాలి. మనస్సులో ఏమీ కనిపించకపోయినా, ఇటూ అటూ, గోడలూ, ఇంటికప్పూ వగైరా అంతటా చూస్తాడు. ఏ మైతేం, ఈరాతపరీక్షలు రకరకాలు; గవర్నమెంటువి, క్లాసువి, యూనివర్సిటీవి, వృత్తివి, పోటీవి, నౌఖరీవి (అనగా సర్వీస్‌వి).

అయితే, ఈపరీక్ష అనేది ఆదిని ఎవడు తెచ్చిపెట్టాడురా మననెత్తిమీదికీ అని ఒక ఆసామీ విమర్శించి, ఒక చైనామనిషి కనిపెట్టాడని తేల్చాడు. చాలా మూలం తెలియనివన్నీ చైనాలో పుట్టాయనడం వాడుకట. కాని ఒక హిందువుడు ఆ ఆసామీని ఖండించి, పరీక్ష అనేది ఇండియాలోనే వెలిసింది అని నిష్కర్ష చెయ్యడానికి రెండుసబబులు చెప్పాడు. ఒకటి—కృష్ణుడిచేత క్షేమంగా చూడబడ్డ పరీక్షన్మహారాజు పరీక్షల్ని సృజించాడని. రెండు— అంతకు చాలా పూర్వమే, ప్రహ్లాదుడికి గురువైన చండామార్కులవారు మార్కుల సంగతి యావత్తూ చాలా తీవ్రంగా కనిపెట్టారని. మొత్తంమీద, ఎక్కడ పుడితేం చిరకాలంనించి ఈ పరీక్షలు ఉన్నాయి, నలుమొహాలా పాకుతున్నాయి.

కాని, ఈ పరీక్షల అట్టహాసం అంతా అసలు ఎందుకు? అనేదిఒక సమస్య. పరీక్ష సాధారణంగా రెండేసి మూడేసి గంట లుంటుంది— అనగా ఒక్కొక్క పేపరు. ఆ స్వల్పకాలంలో అది కుర్రాడి గ్రహణశక్తి, విచక్షణ, జ్ఞాపకశక్తి, సమయస్ఫూర్తి, స్వయం కల్పనాశక్తి, వాక్యరచనాశక్తి, వగైరా బోలెడు కొలవాలి. కాని ఇన్నింటల్లోనూ ముఖ్యంగా జ్ఞాపకశక్తి మాత్రమే ప్రస్తుతపరీక్షలు కొలవగలవు. అనగా, లోగడపుస్తకాల్లో రాసి ఉన్నవృత్తాంతం కుర్రాడి బుర్రకాయలో ప్రవేశించి మాయం అవకుండా ఉందా లేదా అని. కాబట్టి ఇల్లాంటీపరీక్షలో దేన్లోనేనా, అయిదోఆరో మార్కులు తక్కిన వాళ్లకంటే అదనంగా రావడంనుంచి అగ్రస్థానం ఆక్రమించినవాడు, ఎక్కువ జ్ఞాపకశక్తీ, రచనా కౌశల్యం కలవా డనచ్చుగాని, ఎక్కువ తెలివిగలవా డనడానికి వీల్లేదు. ఇంగ్లండులో వెనక ఉంటోచ్చిన రాంగ్లరు పరీక్షలో కొన్ని ఏళ్ళపాటు కృతార్థులైన వాళ్లసంగతి చూడగా, అగ్రగణ్యుల్లో పిక్కాపద్దులున్నూ, రెండు మూడు స్థానాలవాళ్ళల్లో అఖండ ప్రజ్ఞావంతులూ అవుతోచ్చారట. అయినా సరే, ఈ పరీక్ష లెందు కంటే, తెలివితేటలు కనిపెట్టడానికంటారు కొందరు. మరొకాయన్ని అడిగితే, పరీక్షఅనేది కొందర్ని ఫేలుచేసి పంపటానికన్నాడు. ఇంకో ఆయన్ని కనుక్కుంటే

పరీక్షలవల్ల పై అధికార్లకి కొంత ఆదాయం, అంచేతే ఈపరీక్షల్ని నక్కల్లాగ పట్టుగుని వాళ్లూ దేవుళ్లాడుతున్నారు, అన్నాడు.

పోనీ, ఎందుకో అందుకు! పరీక్షకి మూలం ఏమిటి అంటే ప్రత్యేకకమిటీలయొక్క ఆమోదంపొందిన టెక్స్టుబుక్కులు—అనగా నియమిత గ్రంథాలు. అప్పుడప్పుడు, ప్రాలుద్ధంవల్ల మంచిపుస్తకాలు నియమితగ్రంథాలుగా పడతాయి. మొత్తంమీద టెక్స్టుబుక్కు అనగా ఒక తద్దినం. అదితప్ప కడంవి అన్నీ బాగుంటాయంటాడు కుర్రాడు. అదివరదాకా గొంగళీ పురుగులా చీదరగా ఉండేచవటపుస్తకం, అప్రూవుకాగానే, రెక్కలొచ్చి ఎగిరిపోతుంది. ఒగపుస్తకం ఎదేనా పరీక్షకినియమితం అయితే, చాలమందికి లాభం, కొండొకచో గ్రంథకర్తకీ లాభం. ఆగ్రంథంయొక్క ఖరీదులో అనేకమందికి వాటాలు ఉండడంవల్లే, దానిఖరీదు చాలా జాస్తీగా ఉండి, గ్రంథంలో ఉండే పదార్థానికీ ఖరీదుకీ పోలిక లేకుండా ఉండడం. ఆలోచనా నూతనత్వంగలఅపూర్వగ్రంథం అయితే పైవారు ఓపట్టాన్ని ఆమోదించరు. ఒకొక్కగ్రంథాన్ని అబద్ధాలతో ముంచెత్తితేగాని పైవారు స్వీకరించరు. ఒకానొకప్పుడు పుస్తకంలో శృంగారం ఉన్నా ఫరవాలేదు. మరొకప్పుడు పుస్తకంలో రాసి ఉన్నకొన్నికొన్ని సత్యవాక్యాలు తీసేస్తేగాని ఆమోదం దొరకదు ఒకప్పుడు స్త్రీచేత రచింపబడితే సరి, పుస్తకం అప్రూవ్డే. అందుకనే, కొందరు పురుషులు, తమరే పుస్తకాలురాసి, అవి పైవారి ఆమోదం పొందవేమో అనేభయం నివారించుకునేటందుకు, స్త్రీల పేరట అచ్చువేస్తూంటారు, ఇంకొకప్పుడు, ఇంగ్లీషు కంపెనీలలో పడ్డపుస్తకం అవడంవల్లా, వేరొకప్పుడు విశేషప్రజ్ఞ లేకుండానే ఒకడు పుస్తకం రాసినందుకు ఆతణ్ని కాస్త ప్రోత్సహించాలనీహూడా అది నియమిత గ్రంథం అవుతుంది. బోలెడు లోపాయికారీ సంగతులు పురస్కరించుగుని ఆలోచిస్తేగాని వీట్లవయినం తేలదు. కుర్రాళ్లు ఏఇబ్బందోపడి, నియమితగ్రంథాలు కొంటారు — తెలుగుని తప్ప.

ఈలాంటిగ్రంథాలో్న, గ్రంథాలులేని సందర్భంలో విషయసూచికలో్న, ఆధారంగాపెట్టుగుని, వాటిల్లో ప్రశ్నపరంపర—ఒకపేపరు— తయారు చెయ్యడానికి పరీక్షాధికారి ఉంటాడు. (అతణ్ని నియమించడంలో కుడా లుకలుకలు బోలె డుంటాయి). ప్రశ్న అడిగే వాళ్ళకి విషయం తెలియదని మనం అనుకుంటే తప్పు. అందుకని, అతడు విషయం చూసి, ఇంకా పరీక్షకొంత కాలం ఉందనగానే, పేవరు సిద్ధపరిచి, మరి యిద్దరు అధికారుల్తో అది చర్చించి, అవసరం అయితే మార్చి, అచ్చుకి పంపడానికి ఇచ్చేస్తాడు. ఇంతకాండా జరిగినా సరే ఒకొక్కపేపరు అభాంద్రాగానే ఉంటుంది. ఒకొక్కడు, కుర్రాడికిఏమి తెలుసునో కనుక్కునే ప్రశ్న అడిగితే తీరిపోనా, ఏమి తెలియదో కనుక్కుందాం అన్నట్టు ఎక్కడో మూలదాకున్న అల్పవిశేషాలమీద ఇరకాటపుప్రశ్న అడుగుతాడు. ఒకొక్కడు నియమిత గ్రంథం చదవకుండానే గట్టిపేపరు ఇస్తాడు. ప్రశ్న సూటిగా ఉంటే ప్రతీవాడూ చెప్పేసి నెగ్గుకు పోతాడేమో గదా అనే విచారంచొప్పున ఒకొక్క పరీక్షకారుడు, ఆప్రశ్నని వంకరటింకర భాషలో పాతేసి ఇస్తాడు. తను ఏక్లాసుకి పేపరిస్తున్నాడో ఆక్లాసువాళ్ళకంటె ఎక్కువసంగతులు తనకి తెలియవని ప్రజలు అనుమానిస్తారేమోఅని భయంవేసి కాబోలు, ఒకొక్కడు ఆ క్లాసుకి పైవాళ్లు చదివేసంగతులు ఆ క్లాసుకి ఇస్తాడు. ఒకొక్క బద్ధకస్తుడు, తీరుబడిలేక,— పేపరు ఇచ్చినందుకు కొంత పుచ్చుగుంటాడు, అది వేరుమాట!— కుర్రాళ్ళకంట యింకా పడిఉండదు అనితనికి నమ్మకం ఉన్న కొత్త పుస్తకంలోంచి ప్రశ్నలు అక్షరాలా ఇచ్చేస్తాడు, వాటిల్లో ఉండేదోషాల్తో సహా! ఒకప్పుడు పరీక్షాధికారి అన్యదేశంవాడయితే, పొరపాట్న పూర్వసంవత్సరపు నియమితగ్రంథంలోంచి ప్రశ్నలు ఇవ్వడం గాని, లేక నియమితగ్రంథం వ్రాసినకవిచేసిన మఱొకగ్రంథంలోంచి ప్రశ్నలివ్వడంగాని కద్దు. మరొకప్పుడు పరీక్షకారుడు ఎదేనా స్కూలుకి చెందినవాడైతే (ఎంచేతంటే కొందరు పరీక్షకారులు స్కూలు-పాఠం చెప్పడం-వగైరావిరగరు!) తన స్కూలువాళ్లకిప్రశ్నలు

ఏచాటునో చెబుతాడు. మళ్ళ, ఒకొక్కడు తను పరీక్షలో ఇచ్చినవి మినహాయించి కడంవి కొన్ని కుర్రాళ్లకి చెప్పి, అవే వాళ్లచేత రుక్కెయ్యించి, చివరకి వాళ్లచేత పబ్లికుగా పచ్చిబూతులు పడతాడు. కొందరు, తమరు కోరే సమాధానం ఏమిటో స్పష్టంగా తమకే తెలియకుండానే ప్రశ్నలిస్తారు. వాళ్ల ఉద్దేశం, ఎవళ్లూ రాయకపోతే అసలే తగాదా లేదనీ; ఒకవేళ ఎవడేనా తనకి నచ్చేటట్టు రాస్తే, వాటి ఆధారంవల్ల తక్కినవాళ్లవి విలవ కట్టచ్చుననీ. అందాకా యెందుకు! కొందరు పరీక్షాధికార్లని అధాత్తుగా కలుసుగుని జబ్బట్టుగుని కూచోబెట్టి వాళ్లిచ్చినప్రశ్నలే వాళ్లకిస్తే, ఫేలవుతారు. ఒకచోట ఇద్దరు పండితులు కలిసి హిస్టరీపేపరు ఇచ్చారట. అందులో ఒకాయన (పాపం జాగ్రత్తపరుడు!) ఆ ప్రశ్నలకి నమోనా సమాధానాలు రాసి ఉంచుగుని, నలుగురు కుర్రాళ్ళు రాసినసమాధానాలు రాసి ఉంచుగుని, నలుగురు కుర్రాళ్ళు రాసిన సమాధానాలు దిద్ది విలవ కట్టి, ఆమార్కులు వేరే ఓకాగితంమీద ఎక్కించుగున్నాడు. ఆయనప్రకారం నలుగురి కుర్రాళ్లపరీక్షా గోకేసింది. తరవాత, ఆయన ఆ నాలుగుపేపర్లూ పేపరిచ్చిన రెండోపండితుడికి దిద్ది విలవ కట్టగలందుకు పంపించాడట. ఆ పంపడంలో ఆ నలుగురుకుర్రాళ్ళు రాసినసమాధానాలున్న కాగితాలూ కాక, తను రాసి ఉంచుగున్న సమాధానాలకాగితం కుడా, పడిపోయిందిట పొరపాటున. ఈ అయిదు కాగితాలూ ఆ రొండోపండికుడు దిద్ది విలవ కట్టి తేల్చిన ఫలితం ఏమీ అంటే; ఆనలుగురుకుర్రాళ్లూ ప్యాసు, ఆ అయిదోకాగితంవాడు ఫేలూ! కొన్ని నెలల ఆలోచించి ఇవ్వవలసిన ప్రశ్నలు ఇట్టే గోకి పారేస్తే ప్రమాదాలు ఉండక మానవుమరి.

సరి, పరీక్షలు ఇక ఓ నెలో పదిహేనురోజులో ఉండనగా, చాలమంది విద్యార్థులు లేస్తారు. సంవత్సరం పొడూగునా కొంచెంకొంచెం గ్రహించవలసినది ఓ వారం పదిరోజుల్లో సాయంపట్టెయ్యలేమా అని వాళ్ల ఊహ. ఆ పరీక్షకి ఒకయేడు కాక మూడేళ్ళు టైము ఇచ్చినా సరే, వాళ్ళు మూడోసంవత్సరపు చివరనెలలోనే లేస్తారు. అక్కణ్ణించి పరీక్షదాకా ప్రతిరాత్రి మేలుకుంటారు. టీలు తాగుతారు. టీ తాగడానికి ఏపదింటికో కొంతమంది ఏచోటో పోగవుతారు. బోలెడు రాత్రిదాకా మేలుకుండి చదవాలిగదా అని, ముందు టీ కాయడం తాగడం అయేవరకు హాస్కడం. రెండు జాములకిగాని టీలు అవవు. అప్పుడు ప్రారంభించి, కళ్లు జోతులల్లా అయి, ఏదో పుస్తకం తీసి, ఓ పావుగంటవరకూ దృష్టి ఆ పేజీమీదే ఆ మాటవద్దరే ఆగిపోవడం గమనించి, "ప్రాప్తం ఉంటే అదే ప్యాసవుతుంది" అని ఆలోచన్లో పడి, దీపం కాగ కాలాగ అల్లానే అట్టేపెట్టి కన్నుమూసి, ఎండొచ్చిన తరవాత, ఉలిక్కిపడి మేలుకుంటారు. సంవత్సరాదినుంచీ చదివి అప్పణ్ణించీ పండితుడైపోయి ఊరికే కూచునేకంటె, పరీక్ష నాలుగు రోజులూ అఖండత్వం వెళపెళ్ళాడిస్తే చాలదా అని వాళ్ల వాదన. కొందరు, పరీక్షాధికార్లున్న నూళ్ళనించి అంచనా ప్రశ్నలు తెప్పించుతారు. కొందరు, పేపర్లు కొనడానికి రహస్యసంఘాలు ఏర్పరించి పోషకులకోసం వెతుకుతారు. రెండువందలు ఇస్తే పోషకులకోసం వెతుకుతారు. రెండువందలు ఇస్తే పోషకులు, నాలుగువందలికి రాజపోషకులు, వెయ్యి యిస్తే మహారాజపోషకులు—ఇట్లా రేట్లు ఏర్పరుస్తారు. వాళ్ళు, ఒకవేళ నెగ్గితే, తమరు టోకున కొన్నారు గనక, వ్యాపారం లాభం చూసుగుని చిల్లర్ని అమ్ముతారు. అప్పుడు పేపరు పదిరూపాయలకి వస్తుంది. అల్లా కొనుకున్నవాళ్ళు మళ్లీ కక్కుర్తికోసం మరీ చిల్లరిగా ప్రశ్న రూపాయికాడికి వేలం వేస్తారు. కొందరు, మేడీజీలూ, నోట్సూ, తీస్తారు పెద్దవి చూడ్డానికి టైం లేక. ఇల్లా, చివరగడియలో చదవడం హిందువుల్లో ఎక్కువ అంటారు—అందులో ఆంధ్రుల్లో. ఎంచేతంటే, సంవత్సరం మొదణ్ణించీ చీమలా చదువుకునేవాణ్ణి పిక్కాగాడని ఆంధ్రులు ఏడిపిస్తారు. ఇన్నిపాట్లూ ఆవేళకి పడడం ఎందుకంటే, అది సహజం. మానవుడియొక్క సంకల్పం; తనకి ఎంత ప్రజ్ఞ ఉందో అంతకంటె ఎక్కువ ప్రజ్ఞ తనకి ఉన్నట్టు తను లోకానికి కనపడాలని.

తయారీ ఏమోస్తరుది అయితేం, పరీక్షదినాలు వస్తాయి! కుర్రాళ్ళు రాతలు ప్రారంభిస్తారు. మొదటి పేపరుకి మాత్రం కొంత శ్రమించి చదువుతారు. తరవాతనించి, కలంలో సిరా పొయ్యడం, యంత్రంలా వెళ్లిపోయి ఏదో వోటి రాసి చక్కా రావడం. కొందరు, పరీక్ష ఇచ్చేచోటికి, వ్యవధానంలో చదువుకోడానికని మేటిడేసి పుస్తకాలు తీసుకెడతారు. పరీక్షకాలంలో వాచర్లు కొత్తవాళ్ళు కొందరు వస్తారు. కొన్ని స్కూళ్ల గోడలమీద ఆ టైముకి, "కాపీ పట్టుకుంటే బుర్ర ఎగిరిపోతుంది," "చంపేస్తాం రోయ్, జాగ్రత్త" "విల్లు రాసి మరీ కాపీ పట్టుగో" అంటూ వాక్యాలు రాసి ఉంటాయి. టేలు తాగినవాళ్ళు కొందరు డోక్కోడం వగైరాలు ఉంటాయి. డబ్బోసి పేపర్లు కొనుక్కున్న వాళ్లకి అనుకున్న ప్రశ్నలు కనిపించక, కళ్ళు చీకట్లు కమ్మచ్చు. పాపం కొందరు తమ కొచ్చిందంతా ఒక్క దెబ్బలో మరిచిపోయి, ఇవతల కొచ్చింతరవాత అంతా ఏకరు వెడతారు. కొందరు విద్యార్థులు, సమయం దొరకడంవల్ల, "మీరు ఇక్కడ నుంచోడం నాకు అడ్డండీ!" అనీ, "కాసిని నీళ్ళు కావాలండి మంచివి" అనీ వాచర్ల మీద అథార్టీ చేస్తారు. ఒకొక్కచోట పిల్లలూ స్కూలుతాలూకు వాచర్లూ ఏకమై, పరాయివాచర్ని గదులో పెట్టి తాళం వేసి, (అతనికి మంచి టిఫిన్ లోపల ఉంచుతారట!) నియమితకాలం గడిచినతరవాత ఆయన్ని తీస్తారు. వాచరు ఏమాత్రమైనా ఎదిరిస్తే దభిగిణతోం. పరిగెట్టుకు పోబోతే, తరిమి వెంటాడించి పట్టుకుని గుండకింద కొడతారు. ఇక కాపీలల్లో రకాలు కావలిసినన్ని. కాఫీతోపాటు కాపీకూడా ప్రబలింది. కొందరు కోటులోపలవేపున అంకెలూ గట్రా రాసుకుపోతారు. కొందరు ప్యూనుచేత లోపలికి కిల్లీ తెప్పించుతారు, కాగితానికి చుట్టించి. ఒకడు చెప్పుల్లోగాని టోపీ లోపలగాని కాగితాలు ఇరికిస్తాడు. మరొకడు అచ్చు కాగితాలు చింపి జేబూలో వేసుకుపోయి, పేచీనస్తే నమిలి మింగేస్తాడు, అనుమానించినవాచరు తన్ని సమీపించేలోపల. ఒకొక్క నేర్పరి, తనపక్కవాడు సమాధానాలు రాస్తూంటే వాడిచెయ్యి కదలడాన్ని బట్టి అక్షరాలు పోల్చుగుని, తనుకూడా ఆ సమాధానమే రాసేస్తాడు. ఒకొక్కడు, వాచరు వెనక్కి తిరగ్గానే, పక్కవాడికి సంజ్ఞలు చేసి వాడిదగ్గిర్నించి కొంత లాగుతాడు. కొందరు బ్లాటింగుపేపరుమీద రాసి, దాన్ని నడిపిస్తారు. పరోపకారపారీణుడైన ఒకడు తను సగం ప్రశ్నలకిమాత్రమే సమాధానాలు రాసుగుని, కడంవాటి సమాధానాలు పక్కవాడికిస్తే అప్పుడు ఆపక్కవాడు ఆకాగితాలు చూసి స్వదస్తూరీలో సమాధానాలు రాసి ఇచ్చేస్తాడు. అది పూర్తిగా నెగ్గినప్పుడు ఆకాపీదాత అన్నదాత ప్రాణదాతలకంటె ఎక్కువ ఆనందపడతాడు, కాపీదానం పట్టినవాడు అవతలవాడిఋణం ఎన్నిజన్మలకైనా తీర్చుగోలేను గదా అని ఎంతో అంతగా ఇదవుతాడు. ఒకొక్కచోట, ఒకడే ఇద్దరిపేర సమాధానాలు రాస్తాడు. ఇంకోచోట ఓడిబదులు మరోడు వెళ్లి పరీక్షకి కూచోడంకూడా ఉంటుంది. ఒకొక్కడు భంట్రోతుల్ని పైవాళ్లనీ కట్టుగుని, కుట్టేసి సీలుచేసిన పాకెట్టు విప్పించి, లోగడ తను రాసినసమాధానాల కాగితం లాగెయించి, ఆస్థానే, తుడుపేనా లేకుండా నిండుసమాధానాలతో ఉన్న తాజాకాగితం జొనిపించి, మీసంమీద చెయ్యేసి ప్యాసవుతాడు. మరొకచోట, ఒక అల్పజ్ఞాని, తనగదిలోనే పరీక్షకి కూర్చున్న ఒక అఖండుడి నెంబరు కనుక్కుని, తన సమాధానాలపుస్తకపు కవరు వాడిపుస్తకానికీ, వాడిపుస్తకపు-అట్ట తనపుస్తకానికీ ఫిరాయింపించి, తను ఘట్టిగా ప్యాసవడమే కాక, ఆ అఖండుణ్ణి హతమార్చేస్తాడు. ఎవడేనా వాచరు కాస్తంత రాల్చేస్వభావం కలిగి ఉన్నట్టు కనిపిస్తే, అతణ్ని పిల్చి కుర్రాడు రహస్యంగా 'భిక్షాం దేహి' అంటాడు. ఒకొక్కమర్యాదస్తుడు అంచనామీద రెండుమూడుప్రశ్నలకి సమాధానాలు తయారై వెళ్లి, "ఇవి చాలా ముఖ్యం. మీరు పారబడ్డారు" అని చెప్పడానికి గావును అవి అడక్కపోయినా సరే రాసి మరీవస్తాడు. కొందరు, ప్రశ్నలకి సమాధానం తెలియకపోయినా ఏదో మహారాస్తూన్నట్టు అభినయించి, రామకోటి రాజకీయవిషయాలు గాని, బొమ్మలు గాని గియ్యడం.

కొందరు దిద్దేవాళ్ళకి అర్జీలు కొడుతూ కూచుంటారు ఒకడు, "నేను ప్యాసు కాకపోతే నాకు వచ్చిన ఒక ఎక్కా సంబంధం దూసుకుపోతుంది. ఆపాపంమీ మెణ్ని చుట్టుగుంటుంది, కాబట్టి, ఎదో వీలుచూసుగుని నూటికి ముప్ఫైఅయినుప్రాప్తికి నాకు మార్కులు పారెయ్యం చండి! ఇంతలో మీసొమ్మేంపో పోదు!" అని రాశాడు. ఈలాంటి పిటిషనులు వృత్తిపరీక్షలో మరీజోరు. మేష్టరీ ట్రెయినింగుపరీక్షల్లో ఒకడు "అయ్యా! మాకిచ్చిన ఈ పేపరు మాపై గ్రేడుపేనుగులకి సమేతూ కొరుకు పడేట్టు లేదుగందా, ఇది మాకే ఇవ్వడంలో మీరు ఏమన్న పెద్ద మనుష్యులు! ఒళ్లు మండుకొస్తుంది. ఫేలు చేస్తారు గాని అంతకన్న ఏం జెయ్యరుకదా!" అని రాసి కసి తీర్చుగున్నాడు. ఇంకోడు, "అయ్యా! నేను ఈ డ్రాయింగు పరీక్షకి, దీనిమొహం ఈడ్చా, ఆరుమాట్లనుంచి అహూరిస్తున్నాను. నాకూ బొమ్మలకీ పడదు. ఏవో గీస్తానుగాని వాటికి జీవంరాదు, పైగా ఓజంతువుగియ్యబో తేమరోటి వస్తుంది. నాకు రెండుబల్ల సంతానం. నేను ఈయేడు ఆ డ్రాయింగు గట్టెక్కించకపోతే నన్ను తీసేస్తామన్నారు. మీరు నాకు పట్టెడన్నం పెట్టిస్తారా? నోటిమట్టి కొట్టిస్తారా?" అని రాశాడు. అలాంటి ఆరవమోపడి విద్యార్థుల్ని చూస్తే చాలా జాలేస్తుంది. తులసీతీర్థం పుచ్చుగునే టైములో అతణ్ని విద్యనేర్చుగోమనడం ధర్మంలా కనపడదు. కొన్ని వృత్తిపరీక్షల్లో కాపిపట్టింపుతక్కువ. పెద్దమేష్టరీ ట్రెయినింగు ఉంది. ఆపరీక్షకి చదివినకొద్దీ గతీపోతుంది, పరీక్షాపోతుంది. చదవనివాడికి నచ్చేపరీక్ష అది ఒక్కటే. ముందు, ప్రశ్నయొక్క సంఖ్య వేసుగుని మరీ మొదలెట్టాలి, సమాధానం. ఎంచేతంటే, ఏప్రశ్నకి మనం అసమాధానం రాశామో మన మేపట్టుగోలేం. కొందరు, ఆపరీక్షనిమిత్తం మూడో నాలుగో పాయింట్లు సంపాదించి, పేపరులో ఏప్రశ్నలున్నా సరే వాటికింద ఆపాయింట్లు మజాకాగా సర్దేస్తారు. ఇక ప్రైవేటుగా వెళ్లేవాళ్లు. వాళ్ళు పరీక్షప్యాస్ కాకపోతే ప్రమోషను ఆగుతోందని పరీక్షకిమళ్లీ కట్టడం, కట్టాం గదా అని పరీక్షఊరు పరీక్షవేళకి వెళ్ళడం, వెళ్లాంగదా అని ఏదో రాయడం, రాశాంగదాఅని ప్యాసవుతుందని అనుకోడం—ఇంతేగాని సాధారణంగా చదువుకునివెళ్ళడంఅంటూ ఉండదు. ఇల్లా వెళ్లి వెళ్లి కొత్తజ్ఞానం ఏమీ సంపాదించకుండానే—ఏపరీక్షకారుడు మారిన టైములోనో—గుభుక్కుని ప్యాస్ అవడం.

ఈవిధంగా, తెలిస్తే రాతలతోటో, తెలియపోతే కోతలతోటో పేజీలు నింపి, విద్యార్థులు తమపని తమరు కానిస్తారు. అస్పష్టసమాధానా లుండే ఇంగ్లీషులాంటి పేపరు అయింతరవాత, "ఎల్లా ఉందిరా, ఇంగ్లీషూ?" అంటే, "ఏం? బాగానే ఉంది," అంటాడు ప్రతీవాడూకుడా. అప్పటి జవాబులధోరణి చూస్తే, "ఈ ఇంగ్లీషులో ఎవ్వడూ ఫేలే అవడా ఏమిటి చెప్మా!" అనిపిస్తుంది. కాని, స్పష్టసమాధానాలుండే గణితంలాంటి పేపరు అయింతరవాత, "ఏంరా" అంటే కుర్రాడు ఉత్సాహంగా మాట్లాడమో, లేకపోతే మొహం ఏలవెయ్యడమో జరిగి, కత్తీ దెబ్బా అని తేలిపోతుంది. ఇల్లా తత్క్షణం తేలిపోతుందనే కొందరు గడసర్లు తమకి ఏయే ఆన్సర్లు వచ్చాయో అవి నురిచిపోయాం అంటారు. కొందరు ఒక్కొక్క పేపరు అయిపోగానే ఇంటికొచ్చి దానితాలూకు నియమితగ్రంథాలూ, నోట్సూ అన్నీ చక్కటిపొట్టులా చింపి గాడిపొయ్యిలో పోస్తారు. ఒకవేళ పేపర్లు గడువుకాలంలోపలే ఊరేగి పోవడంవల్ల పైవారు రెండోపరీక్ష పెడితే (ఖర్చుమూలాన్ని ఓపట్టాన్ని పెట్టరు) అప్పుడు చదువడానికి ఒక్క పుస్తకం ఉండదు. కొందరు జ్యోతిషం కనుక్కుంటారు—ఫేలయితే జ్యోతిష్కుడి మీదికి తొయ్యడానికి. కొందరు పరీక్షఫలితాలు తేలియక పూర్వం శుభం జరగడం పరీక్షకి జయప్రదం అని ఆలోపలే శుభముహూర్తాలు పెట్టించుతారు. ఫలితాలు తెలిసేవరకూ కొందరు గడ్డం పెంచుతారు. కొందరు, తమకి ఒకొక్క పేపర్లో ఎన్నిమార్కు లొస్తాయో అంచనాలు వేస్తారు. ఆ అంచనాల్లో ప్రతీవాడికీ ప్రతీపేపర్లోనూ ఎంత తక్కువగా చూసుగున్నా ముప్ఫైఅయిదుకంటె పైగానే మార్కులు వస్తూంటాయి—ఎన్నిమాట్లు కట్టినా. కొందరు, తమరికి ఏ ఒక పేపర్లోనేనా సందేహంగాఉంటేతమ పేపరు ఎక్కడికివెళ్లిందో

తెలుసుగుని, ఎన్నివందలమైళ్లయినా సరే, ఆ ఊరు వెళ్ళిపోతారు. దిద్దేవాడిస్వభావం కనిపెడతారు. వాడి దగ్గిరికి వెళ్లేమార్గాలు చూస్తారు. ఆయన ఇంటిదగ్గిర లేని సమయం అయితే, ఇంట్లో తమ సెంబరూ కొన్ని వందలూ పారేసి పోతారు. లేకపోతే, ఆయనికి, ఆయనపై అధికారిచేతో, ఆయన అల్లుడిచేతో, ఆయన ఋణదాతచేతో, మరి ఇతర మొహమాటస్తుడుచేతో చెప్పిస్తారు. పేపరు దిద్దేవాడు విషమస్థితిలో పడతాడు. ఈ దిద్దేవాళ్లల్లో ఒకొక్కడు మార్కులలుబ్ధాగ్రేసరుడు. అతని ఉద్దేశం ఏమిటీ?—సరే, పేపరుకి మొత్తంమార్కులు వంద. అందులో దేవుడివి పది. అవి ముట్టుగోడానికి వీల్లేదు. పది తనివి. పది పై అధికారివి. పది అందానికి మిగతావాటిల్లో తనకినచ్చినచోట సగం కంటె తక్కువగా ఇస్తాడు. ఇక కుర్రాడు తేలడం ఎల్లా? మరోడు, మార్కులసంతర్పి. ఈ రెండురకాల వాళ్ళనీ కూడా పైఅధికారి కాస్త కసిరి, మధ్యరంగంలో ఉండేటట్టు మార్కుల్ని మరమ్మతు చేస్తాడు. ఈరీతిగా బాధపడుతూ, "మనసాయం, అఖండుడికీ అక్కర్లేదు, శుంఠకీ అక్కర్లేదు. ఇటూ అటూ గాకుండా మార్కులు వచ్చినవాళ్ళకి కావాలి వీళ్ళని ముంచనా, తేల్చనా?" అని దేవుళ్లాడుతూ కుప్పనూర్పిడికింప ఒకొక్కడు పేపర్లు దిద్దుతాడు. కుప్పనూర్పిడి అంటే జ్ఞాపకం వచ్చింది—విద్యాధికుషూ వ్యవసాయదారుషూ అంటూ ఆరాలు తీస్తారు గాని, విద్యా వ్యవసాయమే. వ్యవసాయంలోఉన్న లావాలేవీలు యావత్తూ విద్యకీ అహోరించాయి. రెండింటల్లోనూ ముల్లుకర్ర పుచ్చుగోవాలి ఓమాటేనా, పశువుల్ని తోలాలి, విత్తనాలు చల్లాలి, కాపు కాయాలి, కోతలు కొయ్యాలి, కట్టలు కట్టాలి, కుప్పలు నూర్చాలి—ఫలితం దేవసహాయం. దిద్దేవాడి దగ్గిర్నించి కాగితాలు వెళ్లిపోయాయని తెలిసింతరవాత కూడా, కుర్రాళ్లు ఇంకా ఎక్కడ ప్రయత్నించాలో అక్కడ.

"త న్నే వైద్యుండు చికిత్సం బ్రోవఁగలడో, యేమందు రక్షించునో" అని చరమప్రయత్నాలు చేస్తూ, ఎంతేనా సంతోషంగా ఖర్చు చేస్తారు.

అక్కడితో ఫలితాలు వస్తాయి. కొందరు ప్యాసు, కొందరు ఫేలు. ప్యాసైనవాళ్లు తలెత్తుగుని నలుగురూ ఉన్నచోట నడుస్తూంటారు. వాళ్లకి అభినందనాలుకూడా వస్తూంటాయి. కొందరు, (వెనక) కొబ్బరికాయలు కొట్టడం, సత్యనారాయణవ్రతం చెయ్యడం ఉండేది. ఫేలయినవాళ్లలో కొందరు అది మరీ శిరచ్ఛేదంకింద భావిస్తారు. ఎవ్వడూ ఫేలవకుండా పరీక్ష ఎందుకు ఉండకూడదూ! ఎవ్వడూ ఫేలవకపోతే ఇక పరీక్షప్రయోజనం ఏమిటి అసలు అని కోప్పడుతూ మొదటికొచ్చే అధికార్లు కొంద రున్నారు. నూటికి ఏ తొంభైమందో ప్యాసవుతూంటే భరించలేక కళ్లమ్మట నీళ్లు పెట్టుగునేవాళ్లు కొందరున్నారు. కలకత్తాలో నూటికి ౧౫ మంది ఫేలవుతారు. అల్లాంటప్పుడు ప్యాసవడంకంటె ఫేలవడం కష్టం. ఎంచేతంటే నూటికి ౭౫ మందిలో ఉండడంకంటెనూటికి ౧౫ మందిలో సర్దుకోడం కష్టం గనక. అందుకని, మనలో మరీ ఎక్కువ మందిని ప్యాసుచేసి, పరీక్షలపటుత్వం చెడగొట్టి, దేశాన్ని పాడుచెయ్యకుండా, కొద్దిమందినే ప్యాసు చేస్తూంటారు. కాని, పామరులకి లోసంగతులు తెలియవు. వాడు, ప్యాసైనవాడు మహానుభావు డనీ, ఫేలైనవాడు తెలివితక్కువవాడే గాక, తుంటరికూడానని భ్రమిస్తారు. అయితే, పరీక్షఫలితాలు వచ్చినకొత్తరికం అల్లా అనుకున్నా, ఫేలయినవాళ్లలో చాలామంది అఖండులు ఉండచ్చునని కాలక్రమాన్ని గ్రహిస్తారు. కొంతకాలం అయింతరవాత, పుస్తకాలు మళ్లీ చూడకపోతే, వారూ వీరూ ఒకటే అని తెలుస్తుంది. అంతమాత్రాన్ని ఈపరీక్షారాధన ఎందుకో బోధపడదు. ఫలితాలు తెలిసినకొన్నాళ్లు హడావిడిగానే ఉంటుంది. ఒకొక్కసు పిలక్కి తాడుకట్టి తెగభట్టేసెయ్యడం, పరీక్షలో ఏమార్కులో వచ్చి చచ్చిచెడి అత్తీసరుపదునుగా ప్యాసవడం, "ఆఁ. నేను చదివిందేదిరా? జస్టు ఊరికే లీలగాచూశాను, ప్యాసైంది. మనం రొండోసారి చూస్తేనా?" అనడం. అసలుసంగతి, అత డేం జేసినా, అతణ్ని ఏం జేసినా, అంతకంటె ఎక్కువ ఒక్క మార్కు రాదు. ఒకడికి నూటికి ౯౫ వస్తే, ఆకడం

అయినా తనికి ఇవ్వకపోయినందుకు పేపరు దిద్దిన వాడు నరకానికి పెడతాడని, ఓ ఫేలైన వాడిదగ్గర వాదించడం—వాడసలు ఫేలై చదవుతూంటే! ఒకడు ఏమీ చదవకుండానే మార్గాంతరాల వల్ల దాటి, తను బోలెడు చదివి పొడుం అయినట్టు "అబ్బ! మాచెడ్డ అప్సెట్ అయిందిరా సిస్టమ్? రెస్టు పుచ్చుగోవాలి" అనడం. ఒకొక్కడు పరీక్షఫలితాలు తెలిసినప్పుడు అత్తారింటిదగ్గిర ఉండడం తటస్థించి ఫేలయితే అద్భుతమైన కారణాలు చెబుతాడు—"చూడండీ అత్తా! మాసూక్కులు తాలూకు సమాధానపు కాగితాలు ఒక కిరోక్కటకుడికి వెళ్లాయండి. అందులో కర్మం! నాబుక్కు ఆకాగితాలకట్టలో పైనే ఉందిట. ఆకరోక్కటకుడు అప్పుడప్పుడే ఇంట్లో ఏదో దెబ్బలాడి వచ్చాడేమో, ఆపళంగా నాపుస్తకం మొదట్లోనే ఉంది కాదూ, దానిమీద ఒక్కసున్నా పెట్టి, నన్ను బలేసి పారేశాట్ట" అని. మొత్తంమీద ప్యాసులూ, క్లాసులూ, వగైరా మూణ్ణాళ్ల ముచ్చటలు.

ఇన్ని సంగతులూ, ఇంకా లక్షూ, జరిగిన తరవాత వచ్చినఫలితాలమీద ఆధారపడి తెలివితేటలూ, ఉద్యోగార్హతా నిర్ణయించడం న్యాయం అని చెప్పలేం. కొందరు అసలు పరీక్షలుతీసేస్తే పీడ వదుల్తుందనివాదిస్తారు. కాని, విద్య ఉన్నంతకాలం పరీక్ష తప్పదు. ఎంచేతంటే, విద్యబోధించి చెప్పాలి. బోధనకి ప్రశ్నా, సమాధానం ఉండాలి. ప్రశ్న పరీక్షయొక్క చిహ్నం. అందుచేత, ధనికులైన ఇతరదేశీయులు కొత్త పరీక్షలు కనిపెట్టి, ఆచరణలో పెట్టి, పైనిచెప్పిన అన్యాయాలు తగ్గించాలని చూస్తున్నారు. మన ప్రస్తుతపరీక్షలు కొండని ముక్కలకింద కొట్టమంటాయి. కొత్త పరీక్షలు, చినచిన్న ముక్కల్ని గబగబాపోగుచేసి కొండలా పేర్చమంటాయి. మన పరీక్షలవిధానం మారాలీ అంటే, మనుష్యులు మారాలి. అనగా మనస్సులు మారాలి. కాలం జరిగితే గాని మనస్సులు మారవు. పరీక్షలకోసం, మార్కులకోసంమాత్రమే బాధపడేవాడికి, విద్య అంటదు. విద్యకోసం పాటుపడేవాడికి పరీక్షవల్ల బాధే ఉండదు. ఎంచేతంటే, వాడు ప్రతీకొత్తసంగతీ పరీక్షవల్లే నేర్చుగోవలసిన అవసరం ఉండడంచేత, వాడికిపరీక్ష మామూలైపోతుంది. పరీక్ష నాలుగుపూటలూ ఏ అరువుముక్కలో ముక్కునెట్టుగుని తెలివిగలవాడికిమల్లే కనిపించి, ఆ కాలానికి పూర్వాపరాలు మూర్ఖుడై ఉండడంమానవుడు కోరుకోకూడదు. అసలు జీవితం ఒక పెద్ద నిత్యపరీక్ష. జీవితపరీక్షకి ఎప్పుడో తయారు అవుతానులే అనడం కాక, ఎప్పటికప్పుడు తయారుగా ఉండడం మానవుడి విధి. అటువంటిధన్యుడిజీవితం ఆదర్శం. నమస్కారం.

జానకీనాథ యేల దర్శనము నీవు?

అధికార్ల సూర్యనారాయణరావుగారు,
B. A., B. L.

మొలక నగవుల చంద్రుని ముద్దుమోము
తొంగి చూచెడు విమలహా నింగినుండి
బాలు డాటల చాలించి పవ్వళించె;
దీప మొక్కటె తోడుగా తెలివికలల
కాల మెట్టట్లొ పుచ్చుచు గాచియుంటి
జానకీనాథ! యేల దర్శనము నీవు?

౨

అంబునిధిలోన ఆణిముత్యంబు వోలె
కటికచీకటిలో దీపకళిక వోలె
కంటకములలోన గులాబికన్నె వోలె
నకట! నెమ్మది గ్రమ్మ నిరాశయందు
దాచి యుంచితి ప్రణయంబు తాళజాల!
జానకీనాథ! యేల దర్శనము నీవు?